సాక్షి కృష్ణాజిల్లా

మంగళవారం । 7 । నవంబర్ । 2023



కాలువలోకి స్కూల్ బస్సు పల్టీ

విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్సు అదుపు తప్పి కాలువలోకి పల్టీ కొట్టింది. స్థానికులు స్పందించి విద్యార్థులను రక్షించారు.

-IIలో▸



బస్టాండ్‌లో ఘోరం

బస్టాండ్(విజయవాడసెంట్రల్): విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో సోమవారం ఆర్టీసీ బస్సు ప్లాట్‌ఫాంపైకి దూసుకొచ్చిన ప్రమాదంలో ఓ చిన్నారి సహా ముగ్గురు మృత్యువాత పడ్డారు.



బాణసంచా విక్రయాలపై సమీక్ష

దీపావళి బాణసంచా విక్రయాల్లో తీసుకోవాల్సిన ముందస్తు భద్రత చర్యలపై డీసీపీ విశాల్ గున్ని, సబ్ కలెక్టర్ అదితి సింగ్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

-IIలో▸

న్యూస్‌రీల్

లేపాక్షిలో ప్రమిదల విక్రయాలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దీపావళిని పురస్కరించుకుని గాంధీనగర్ లేపాక్షి ఎంపోరియంలో ప్రమిదల ప్రదర్శన, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ మేనేజర్ ఎం.సురేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 11వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి తెప్పించిన టెర్రకోట (ఎర్రమట్టి) కుందన్ డిజైన్స్ మైనంతో నింపి తయారు చేసిన సరికొత్త అందమైన దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని వివరించారు. ఈ దీపాలు గిఫ్ట్ బాక్సుల్లో లభ్యమవుతాయని తెలిపారు. దీపావళి పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఓబీసీ మహిళల వాటా ఎంతో తేల్చాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా బిల్లులో ఓబీసీ మహిళల వాటా ఎంతో తేల్చాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం కేసన శంకరరావు డిమాండ్ చేశారు. అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. శంకరరావు మాట్లాడుతూ.. మహిళా బిల్లులో ఓబీసీ మహిళలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా ఓబీసీ వర్గాలు ఎంత శాతమో లెక్క తేల్చాలన్నారు. అందులో ఓబీసీ మహిళలు ఎందరు, వారికి బిల్లుతో దక్కే వాటా ఎంతో తేల్చాలని డిమాండ్ చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. అనంతరం తమ డిమాండ్లపై కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, వావిలాల సరళ దేవి, మార్కాపురపు కనకారావు, గుర్రపు ద్వారక శ్రీను, స్వాతి, హనుమంతరావు, షేక్ ముస్తఫా, గుర్రం జానకిరాం ప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛ దివాళి.. శుభ దివాళి పోస్టర్ ఆవిష్కరణ



పటమట(విజయవాడతూర్పు): నగరవాసులందరూ ఈ ఏడాది శుభప్రదమైన దీపావళిని స్వచ్ఛ దీపావళిగా జరుపుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. పర్యావరణ హితమైన పదార్థాలనే వినియోగించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడొద్దని కోరారు. వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూంలో వీఎంసీ అధికారులతో కలిసి ఆయన సోమవారం స్వచ్ఛ దివాళి.. శుభ దివాళి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దీపావళి పండుగను కాలుష్యాన్ని పెంచే కారకాలు కాకుండా, పర్యావరణ హిత పదార్థాలను ఉపయోగించి జరుపుకోవాలనే లక్ష్యంతో 'స్వచ్ఛ దివాళి.. శుభ దివాళి' నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ రత్నావళి, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరన్ రాయ్, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్.ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

8న మినీ జాబ్‌మేళా

మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల ఎనిమిదో తేదీన స్థానిక జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో మినీ జాబ్‌మేళా జరుగుతుందని ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్నోవా కంపెనీ, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్, ఫోన్‌పే, అపోలో ఫార్మసీ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా ఇన్ మెకానికల్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరుకావొచ్చన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగులు బయోడేటా, సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం లభిస్తుందన్నారు. వివరాలకు 8142416211 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొండకు పండుగ శోభ

- వారం పాటు పండుగలు, విశేష పర్వదినాలు
- 12 నుంచి 18 వరకు ప్రత్యేక సేవలు
- 15న దుర్గమ్మకు గాజుల అలంకరణ
- 16న సరస్వతీ యాగం, 17న నాగుల చవితి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కనకదుర్గమ్మ కొలువైన ఇంద్రకీలాద్రికి పండుగ శోభ వచ్చింది. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు పండుగలు, విశేష పర్వదినాల నేపథ్యంలో దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 12వ తేదీ దీపావళితో ప్రారంభమయ్యే వేడుకలు 18వ తేదీ వరకు కొనసాగుతాయి. వరసగా వారం రోజుల పాటు విశేష పర్వదినాలు, పండుగలు రావడం ఇదే తొలి సారి.

12న దీపావళి

దుర్గమ్మ సన్నిధిలో 12వ తేదీ దీపావళి వేడుకలు నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం అమ్మవారికి పంచహారతుల అనంతరం ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగిస్తారు. ఆలయ ప్రాంగణంలో బాణసంచా కాల్చి దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు.

13న ఆర్జిత సేవలకు డిమాండ్

అమావాస్య నేపథ్యంలో అమ్మవారి సన్నిధిలోని యాగశాలలో నిర్వహించే పలు ఆర్జిత సేవలకు డిమాండ్ అధికంగా ఉంటుంది. తెల్లవారుజామున అమ్మవారి అంతరాలయంలో నిర్వహించే ఖడ్గమాలార్చన, చండీ హోమంతో పాటు లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చనకు భక్తుల నుంచి డిమాండ్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా చండీ హోమానికి రికార్డు స్థాయిలో భక్తులు హాజరవుతారు. అమావాస్య రోజున సుమారు 300లకు పైగా టికెట్లను దేవస్థానం విక్రయిస్తుంది. యాగశాలలో అంత మంది భక్తులు కూర్చునే అవకాశం ఉండదు. ఆరుబయట కూర్చుని తమ గోత్రనామాలతో పూజ జరిగితే చాలు అని భక్తులు భావిస్తారు. దీపావళి అమావాస్య నేపథ్యంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

14న కార్తిక మాసోత్సవాలు ప్రారంభం

ఈ నెల 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మల్లేశ్వర స్వామి వారికి నిత్యపూజలు, అభిషేకాలు ప్రారంభం కానున్నాయి. కార్తిక మాసం సందర్భంగా మల్లేశ్వర స్వామికి నిత్యం సహస్ర లింగార్చన, రుద్రహోమం, ఊంజల సేవ జరుగుతాయి. సాయంత్రం మల్లేశ్వర స్వామి ఆలయం, నటరాజ స్వామి ఆలయం వద్ద ఆకాశదీపాన్ని వెలిగిస్తారు. స్వామికి కార్తిక సోమవారాలు, ఏకాదశి, మాస శివరాత్రి పర్వదినాల్లో బిల్వార్చన జరుగుతుంది. 26వ తేదీ కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం, 27వ తేదీ సోమవారం కార్తిక పౌర్ణమి గిరి ప్రదక్షిణ, బిల్వార్చన జరుగుతాయి.

దుర్గమ్మకు గాజుల అలంకారం

యమ ద్వితీయ, భగిని హస్త భోజనాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు గాజులతో విశేష అలంకరణ జరుగుతుంది. ఉత్సవంలో భాగంగా అమ్మవారి మూలవిరాట్‌తో పాటు మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని గాజులతో విశేషంగా అలంకరిస్తారు. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణం మొత్తాన్ని రంగు రంగుల గాజులతో ముస్తాబు చేస్తారు. ఉత్సవం ముగిసిన అనంతరం అమ్మవారికి అలంకరించిన గాజులను క్యూలైన్‌లో భక్తులకు పంపిణీ చేస్తారు. అమ్మవారి అలంకరణ నిమిత్తం అవసరమైన గాజులను దాతలు, భక్తులు దేవస్థానానికి విరాళంగా అందజేయొచ్చు.

16న సరస్వతీ యాగం

మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని 16వ తేదీన ఇంద్రకీలాద్రిపై అమ్మవారి సన్నిధిలో సరస్వతి యాగాన్ని నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఈ యాగాన్ని ఆలయ అర్చకులు, వేద పండితులు నిర్వహిస్తారు. యాగంలో పాఠశాల విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉంది. యాగంలో పాల్గొన్న విద్యార్థులకు అమ్మవారి చెంత ఉంచి పూజలు నిర్వహించిన పెన్నులను పంపిణీ చేస్తారు.

17న నాగుల చవితి

కార్తిక శుద్ధ చవితిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రాంగణంలోని నాగేంద్రస్వామి పుట్ట వద్ద ఈ నెల 17వ తేదీన స్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలోని జంట నాగేంద్ర స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతాయి.

18వ తేదీన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం ఈ నెల 18వ తేదీన జరుగుతుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై స్వామి కల్యాణ వేడుకను ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని స్వామి ఆలయం నుంచి ప్రారంభమయ్యే ఊరేగింపు, కల్యాణం అనంతరం నిర్వహించే ఊరేగింపులో పల్లకి మోసేందుకు భక్తులు ఎంతో ఆసక్తిని చూపుతారు. స్వామి కల్యాణంలో పాల్గొన్న వారికి కల్యాణ యోగం, సంతానం లేని వారికి సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం.

ధాన్యం సేకరణకు పటిష్ట ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అపరాజితాసింగ్, ఇతర అధికారులు

- రవాణా వాహనాలకు జీపీఎస్
- సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్
- కృష్ణా జిల్లా జేసీ అపరాజితాసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్ తెలిపారు. ధాన్యం సేకరణ సన్నద్ధతపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, రవాణా, వ్యవసాయ మార్కెటింగ్, సహకారశాఖ అధికారులతో జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేసీ మాట్లాడుతూ గత సీజన్‌లో ధాన్యం సేకరణలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముందుగా గోనెసంచుల కొరత లేకుండా ముందుగానే అవసరమైన మేరకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ధాన్యాన్ని రవాణా చేసే ప్రతి వాహనానికి జీపీఎస్ పరికరాన్ని ముందుగానే అమర్చే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి మండలానికి మొబైల్ టెక్నికల్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామసభలు నిర్వహించి ధాన్యం సేకరణ విధానాలపై రైతులకు ముందుగానే అవగాహన కల్పిస్తామన్నారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతుల కోసం కంట్రోల్ రూమ్..

రైతులకు ఎటువంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేందుకు కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని జేసీ చెప్పారు. రైతులు మిల్లర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఏమైనా సమస్యలు ఉంటే డయల్ యువర్ జేసీ(8143889918)కి తెలియజేయాలన్నారు. ధాన్యం మద్దతు ధరలు, కంట్రోల్ రూమ్ నంబర్లు, డయల్ యువర్ జేసీ నంబర్ ప్రతి ధాన్యం సేకరణ కేంద్రం వద్ద ప్రదర్శించాలన్నారు. ఈ సీజన్‌లో ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేయటం లేదన్నారు.

దళారీల బారిన పడొద్దు..

జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు జన్ను రాఘవరావు మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతులకు సమస్యలు ఏర్పడకుండా అధికారులు కృషి చేయాలన్నారు. దళారీల బారిన పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే పండించిన ధాన్యాన్ని విక్రయించుకుని మద్దతు ధర పొందాలన్నారు.

'మద్దతు' ఇలా..

పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి. శ్రీధర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో ధాన్యం మద్దతు ధరలు క్వింటాకు గ్రేడ్-ఏ రకం రూ. 2,203, కామన్ రకం రూ. 2,183గా ప్రభుత్వ నిర్ణయించిందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయానికి ముందుగా పోత పోసుకుని మట్టి బెడ్డల తొలగింపు చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం సేకరణ సమయంలో వాతావరణ పరిస్థితులు మారి ధాన్యం తడిస్తే ప్రతి మండలంలో ఒక్కొక్క మిల్లు పాయ, రంగు మారిన ధాన్యం కొనుగోలు చేసేలా ముందుగా ఏర్పాట్లు చేయాలని సభ్యులు సూచించారు. సమావేశంలో ఆర్డీవోలు ఎం వాణి, దాసి రాజు, బి పద్మావతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. పద్మావతి, డీఎస్‌వో వి.పార్వతి, డీసీవో ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సాయం.. రైతుకు స్థైర్యం

- నేడు జమ కానున్న రైతు భరోసా సొమ్ము
- రెండో విడతగా అందనున్న రూ. 4 వేలు
- కృష్ణాజిల్లాలో 1,58,302 మంది లబ్ధిదారులు
- రెండో విడతగా విడుదల కానున్న రూ 65.92 కోట్లు



కంకిపాడు(పెనమలూరు): అన్నదాతలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సాగులో భరోసా కల్పిస్తూ వెన్నుతట్టి ప్రోత్సహిస్తోంది. ఇచ్చిన మాట తప్పకుండా డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ రెండో విడత రైతు భరోసా సొమ్మును మంగళవారం విడుదల చేసేందుకు యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. రెండోవిడతగా రైతుల ఖాతాలకు రూ. 4 వేలు సొమ్ము జమ కానుంది.

కృష్ణా జిల్లాలో 1,58,302 మందికి లబ్ధి..

జిల్లాలోని 25 మండలాల్లో ఏడు నియోజకవర్గాలకు సంబంధించి వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకానికి అర్హుల జాబితాను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. సాగు ధ్రువీకరణ పత్రాలు పొందిన సాగుదారులు, భూ యజమానులు, అటవీ భూములు (ఆర్‌ఓఎఫ్‌ఆర్) సాగుచేసే వారికి పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ ఏడాది తొలి విడతగా వైఎస్సార్ రైతు భరోసా కింద 1,55,004 మందికి రూ. 116.25 కోట్లు అందింది. రెండో విడతగా 1,58,302 మందికి రూ.4వేలు చొప్పున రూ. 65.92 కోట్లు జమకానుంది.

నాలుగున్నరేళ్లలో రూ. 824.26 కోట్లు లబ్ధి..

ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు బాసటగా నిలుస్తున్నారు. రైతుభరోసా కింద నాలుగున్నరేళ్లలో జిల్లాలో రైతాంగానికి రూ. 824.26 కోట్లు మేర లబ్ధి చేకూరింది. 2019-20లో 1,44,234 మందికి రూ. 219.68 కోట్లు, 2020-21 సంవత్సరానికి 1,50,487 మందికి రూ. 212.10 కోట్లు, 2021-22 సంవత్సరానికి 1,43,707 మందికి రూ. 201.43 కోట్లు, 2022-23 సంవత్సరానికి 151505 మందికి రూ. 191.05 కోట్లు జమ అయ్యింది.

పెరిగిన లబ్ధిదారులు..

వరుసగా ఐదో ఏడాది తొలి విడతగా రూ. 7,500 చొప్పున 1,55,004 మందికి రూ. 116.25 కోట్లు అందగా, రెండో విడతగా రూ. 4 వేలు చొప్పున 1,58,302 మందికి రూ. 65.92 కోట్లు అందనున్నాయి. 2023-24 సంవత్సరానికి గానూ మొదటి విడతలో 1,55,004 మందికి లబ్ధి జరిగితే, రెండో విడతలో ఆ సంఖ్య 1,58,302కి చేరింది. వాస్తవ సాగుదారులు, అర్హతను బట్టి ప్రతి ఒక్కరికీ పథకాన్ని వర్తింప చేస్తూ సాగుకు భరోసా కల్పిస్తోంది.

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	లబ్ధిదారులు	అందిన మొత్తం (రూ. కోట్లలో)
అవనిగడ్డ	34,734	14.52
గన్నవరం	27,465	11.37
గుడివాడ	12,811	5.32
మచిలీపట్నం	9,510	4.00
పామర్రు	34,954	14.50
పెడన	27,197	11.41
పెనమలూరు	11,631	4.78

ఇది రైతు ప్రభుత్వం..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఏటా రైతుభరోసా అందిస్తోంది. మా కుటుంబానికి ఎకరంన్నర పొలం ఉంది. పెట్టుబడికి ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు కష్టం తెలుసుకుని భరోసా కింద సొమ్ము అందిస్తోంది. సాగులో ధైర్యంగా ముందుకు సాగుతున్నాం.

– కొండేటి శివ సుబ్బారావు, రైతు, మంతెన, కంకిపాడు మండలం

అర్హులందరికీ భరోసా..



అర్హులందరికీ భరోసా కల్పించేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేస్తున్నాం. అర్హులైన ప్రతి సన్న, చిన్నకారు రైతులు, వాస్తవ సాగుదారులు, భూయజమానులకు రైతుభరోసా పథకం వర్తింపజేస్తున్నాం. ఈ సీజన్‌కు రెండోవిడత సొమ్ము మంగళవారం రైతు ఖాతాలకు జమ కానుంది. ఇందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకున్నాం.

– ఎస్.పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి, కృష్ణాజిల్లా

విరివిగా రుణాలివ్వండి

బ్యాంకర్లతో కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, చిత్రంలో ఎమ్మెల్యే పేర్ని నాని, ఎల్‌డీఎం జయవర్ధన్

చిలకలపూడి(మచిలీపట్నం): వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు వెంటనే రుణాలు అందించి సహకరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు బ్యాంకర్లను ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా పరిషత్ సమావేశపు హాలులో మాజీ మంత్రి, బందరు శాసనసభ్యుడు పేర్ని వెంకట్రామయ్య (నాని)తో కలిసి నియోజకవర్గానికి సంబంధించిన లబ్ధిదారుల రుణాల మంజూరు అంశంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం పథకాలు మంజూరు చేస్తోందని ఆ పథకాలకు సంబంధించి బ్యాంకుల ద్వారా రుణాలు పొందాల్సి వచ్చినప్పుడు బ్యాంకు అధికారులు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలన్నారు. వివిధ బ్యాంకుల్లో మహిళా సంఘాలకు సంబంధించిన రూ. 680 కోట్లు పొదుపు సొమ్ము ఉందని, ఈ మొత్తాన్ని అంతర్గతంగా రుణాలు తీసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. బిజినెస్ కరస్పాండెంట్లుగా ఉన్న మహిళా సంఘాల సభ్యులు వారి కుటుంబ సభ్యులను కాకుండా కొత్త వారిని నియమించుకోవాలని ఆదేశించారు. పరిశ్రమలశాఖ ద్వారా 237 దరఖాస్తులు పంపితే కేవలం 62 మందికి మంజూరయ్యాయన్నారు.

కౌలు రైతులను ప్రోత్సహించండి..

జిల్లాలో 57,890 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేశామని, వివిధ బ్యాంకులు కేవలం 11,557 మందికి మాత్రమే రూ. 46.94 కోట్లు రుణాలు మంజూరు చేశాయని కలెక్టర్ చెప్పారు. ఆయా బ్యాంకుల్లో రైతుల వ్యక్తిగత ఖాతాలు ఉంటాయని, ధాన్యం విక్రయించినప్పుడు ఆ ఖాతాల్లోకే ప్రభుత్వం ధాన్యం డబ్బును జమ చేస్తుందని దీని ద్వారా రుణాలు ఇచ్చిన రైతులకు రుణం మొత్తాన్ని రికవరీ చేసుకునే అవకాశం ఉంటుందని, ఇందుకోసం బ్యాంకర్లు పునరాలోచించాలన్నారు. మత్స్యశాఖ ద్వారా వివిధ అంశాల్లో ఆర్థిక సాయం కోసం 4,967 మంది దరఖాస్తులు చేసుకున్నారని వీటిని ఆయా బ్యాంకులకు పంపగా కేవలం 320 మందికి మాత్రమే రుణ సహాయం మంజూరు చేశారన్నారు. వీటిపై అధికారులు పునఃపరిశీలించాలన్నారు.

అనుమతులివ్వండి..

ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలకు పొదుపు చేసుకున్న మొత్తాల్లో రుణాలు ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో అనుమతులు ఇవ్వటం లేదన్నారు. వ్యక్తిగతంగా ప్రతి మహిళకు రుణాలు అందేలా చూడాలన్నారు. బ్యాంకులు వినియోగదారులకు చేరువ కావాలనే లక్ష్యంతో బిజినెస్ కరస్పాండెంట్లను ఏర్పాటు చేశామని, వీరు అక్రమాలకు పాల్పడకుండా చూడాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ జయవర్ధన్, డీఆర్‌డీఏ పీడీ పీఎస్‌ఆర్ ప్రసాద్, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి వెంకట్రావు, వ్యవసాయశాఖ డీడీ మనోహర్ పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

- కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు
- స్పందనలో 126 అర్జీలు స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, జేసీ అపరాజితాసింగ్, డీఆర్వో రోజా

చిలకలపూడి(మచిలీపట్నం): స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ అపరాజితాసింగ్, డీఆర్వో పెద్ది రోజా, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, బందరు ఆర్డీవో ఎం. వాణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయప్రయాసలతో సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి విచ్చేస్తున్నారని, వారికి సంతృప్తికర పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పని చేయాలన్నారు. స్పందన కార్యక్రమంలో అధికారులు 126 అర్జీలను స్వీకరించారు.

వచ్చిన అర్జీల్లో కొన్ని..

- కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లులో 50 శాతానికి పైగా ఉన్న ఓబీసీ మహిళలకు తీరని అన్యాయం జరిగిందని.. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు జనాభా దామాషా కోటా కల్పించాలని కోరుతూ కృష్ణా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అందే జగదీష్ అర్జీ ఇచ్చారు.
- కోడూరు మండలం ఉల్లిపాలెంలో రోడ్డు మధ్యలో ఐదు అడుగుల లోతు, మూడు అడుగుల వెడల్పుతో పెద్ద బోదెను తవ్వి.. రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారని.. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు బడే రాఘవరావు అర్జీ ఇచ్చారు.

గృహాల మధ్య పేడ కుప్పలపై ఆగ్రహం

మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీ బొమ్మ శివాలయం వెనుక ప్రాంతంలో నివాసాల మధ్య పేడకుప్పలతో ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంత ప్రజలు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్ స్పందన ముగిసిన అనంతరం నేరుగా ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. తమ ప్రైవేటు స్థలంలో పేడ కుప్పలు వేశామని పశు యజమానులు చెప్పే ప్రయత్నం చేయగా గృహాల మధ్య ఎలా వేస్తారని ఆమె ప్రశ్నించారు. పేడకుప్పలు ఉన్న స్థలం ప్రైవేటుదో, మునిసిపాలిటీదో పరిశీలించి ప్రహరీ ఏర్పాటు చేయాలని కమిషనర్ జి. చంద్రయ్యను ఆదేశించారు.

కృష్ణా వర్సిటీ కబడ్డీ టోర్నీ విజేత ఎస్‌ఆర్‌ఆర్



ఎస్‌ఆర్‌ఆర్ జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, కోటేశ్వరరావు, యుగంధర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల కబడ్డీ పురుషుల టోర్నమెంట్‌లో మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల జట్టు విజయకేతనం ఎగురవేసింది. మూడు రోజుల పాటు ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. సోమవారం జరిగిన పోటీల్లో ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల కబడ్డీ జట్టు నలంద డిగ్రీ కళాశాల జట్టుపై 46-26 స్కోరు తేడాతో విజయం సాధించింది. మొత్తం 14 కళాశాల జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో నూజివీడు డీఏఆర్ కళాశాల జట్టు ద్వితీయ స్థానం, విజయవాడ నలంద డిగ్రీ కళాశాల జట్టు తృతీయ స్థానం, మైలవరం డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు చతుర్థ స్థానంలో నిలిచాయి. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ట్రోఫీ అందజేశారు. కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ మండవ కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్ పోటీలను పర్యవేక్షించారు.

సౌత్‌జోన్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక

కాకినాడ జేఎన్‌టీయూలో ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి జరిగే సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో కృష్ణా యూనివర్సిటీ కబడ్డీ పురుషుల జట్టు పాల్గొంటుందని డాక్టర్ మండవ కోటేశ్వరరావు, డాక్టర్ డి. యుగంధర్ తెలిపారు. ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల నుంచి కె.వెంకట్ ఫణీంద్ర, వై.శామ్యూల్ రాజ్, బి.వెంకటేశ్వర్లు, ఎస్‌కే దావూద్, నూజివీడు డీఏఆర్ కళాశాల నుంచి పి.శ్యామ్ కుమార్, వి.వర ప్రసాద్, విజయవాడ నలంద డిగ్రీ కళాశాల నుంచి పి.గౌరినాయుడు, రంగ నవీన్‌రాజు, మైలవరం డాక్టర్ ఎల్ హెచ్‌ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల నుంచి కె.వెంకట నాగ సాయి, విజయవాడ పీబీఎస్ కళాశాల నుంచి కె.మహేష్, విజయవాడ కేబీఎన్ కళాశాల నుంచి ఎ.వేణు, గుడివాడ ఏఎన్‌ఆర్ కళాశాల నుంచి ఎస్.ప్రవీణ్ సౌత్ జోన్ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు.

క్లుప్తంగా

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్



చిలకలపూడి(మచిలీపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రాజాబాబు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై జరుగుతున్న వైద్య ఆరోగ్య శిబిరాలు సాధారణ వైద్యశిబిరాలు కావని, రోగుల జబ్బు నయం అయ్యేదాకా పూర్తిస్థాయిలో చేయూతనివ్వటమే ప్రభుత్వ ఉద్దేశమని, ఇందుకనుగుణంగా అధికారులందరూ పాటించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జి.గీతాబాయి, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సతీష్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంక్షేమానికి జగన్ పెద్దపీట

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్లు పుల్లయ్య



గుడివాడ టౌన్: గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్ద పీట వేసిందని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్లు పుల్లయ్య అన్నారు. సోమవారం ఆయన గుడివాడ పట్టణంలో స్థానిక నాయీ బ్రాహ్మణ సంఘీయులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి టీటీడీ దేవస్థానం పాలక వర్గంలో నాయీ బ్రాహ్మణులను డైరెక్టర్లుగా నియమించిన ఘనత దక్కించుకున్నారన్నారు. దీనిని బట్టి నాయీ బ్రాహ్మణుల పట్ల ఆయనకున్న అభిమానం బహిర్గతం అవుతోందన్నారు. నాయీ బ్రాహ్మణులను కించపరిచే విధంగా చంద్రబాబునాయుడు దూషిస్తే, నేటి ముఖ్యమంత్రి నాయీబ్రాహ్మణులను సామాజిక వర్గం పేరుతో పిలిస్తే శిక్షించేందుకు జీవో విడుదల చేశారని అన్నారు. నాయీబ్రాహ్మణులంతా జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు డీఆర్‌బీ ప్రసాద్, డి.రామకృష్ణ, సీహెచ్ బాబి, సీహెచ్ మహేష్, సీహెచ్ సాంబశివరావు పాల్గొన్నారు.

ఉత్కంఠగా జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ



టోర్నమెంట్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఏపీ సీఎం జగన్ ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం మెయిన్ డ్రా మ్యాచ్‌లు రెండో రోజు ఉత్కంఠగా సాగాయి. ఈ మ్యాచ్‌లు బందరురోడ్డులోని దండమూడి రాజగోపాలరావు మున్సిపల్ ఇండోర్ స్టేడియం, పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, గురునానక్ నగర్‌లోని సాయి సందీప్ అకాడమీల్లో జరిగాయి. ఆంధ్రా రంజీ క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ విజయసారథి, సీనియర్ క్రికెటర్ మురళీకృష్ణంరాజు దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లను వీక్షించారు.

- అండర్ 15 బాయ్స్ సింగిల్స్ విభాగంలో కర్ణాటకకు చెందిన ప్రతీక్ కౌండిల్య, మహారాష్ట్రకు చెందిన అవధూత్, తెలంగాణకు చెందిన జి.శ్రావణ్‌కుమార్, మహారాష్ట్రకు చెందిన హర్షిత్ మెయిన్ డ్రా మ్యాచ్ రెండో రౌండ్‌లో ప్రతిభ చూపి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.
- అండర్–15 బాలికల సింగిల్స్ విభాగంలో తమిళనాడుకు చెందిన దిశ, ఢిల్లీకి చెందిన రిషికా నంది, కర్ణాటకకు చెందిన నిధి, గుజరాత్‌కు చెందిన సోనియా గాలా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన దివ్యశ్రీ మెయిన్ డ్రా మ్యాచ్‌ల్లో రెండో రౌండ్‌లో ప్రతిభ చూపి మూడో రౌండ్ ప్రవేశానికి అర్హత పొందారు.
- అండర్–15 బాయ్స్ డబుల్స్ విభాగంలో కర్ణాటకకు చెందిన నిలీష్ జయరాజ్, హార్థిక్ మహంతి, కేరళకు చెందిన కిరణ్ నాగూంచి, జావెద్ రహమాన్, తెలంగాణకు చెందిన షాహీద్ ఇబ్రహీం పీర్, సూర్య మెయిన్ డ్రా మ్యాచ్‌లో రెండో రౌండ్‌లో ప్రతిభ చూపి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.
- అండర్–15 బాలికల డబుల్స్ విభాగంలో కర్ణాటకకు చెందిన దీపక్ రాజ్ అతిథి, వర్ధిని, తెలంగాణకు చెందిన బాల మన్వితా రెడ్డి, అమృత, తమిళనాడుకు చెందిన మోక్షిత, రాజరాజేశ్వరి ప్రధాన డ్రా మ్యాచ్ రెండో రౌండ్‌లో ప్రతిభ చూపి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.
- అండర్–17 బాలికల సింగిల్స్ విభాగంలో మహారాష్ట్రకు చెందిన నిషా కౌర్, తమిళనాడుకు చెందిన రీమా పర్వీన్, హర్యానాకు చెందిన మాధవీ నాయర్, ఢిల్లీకి చెందిన ఇషితా ప్రధాన డ్రా మ్యాచ్‌ల్లో రెండో రౌండ్‌లో ప్రతిభ చూపి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.
- అండర్–17 బాయ్స్ డబుల్స్ విభాగంలో పాండిచ్చేరికి చెందిన మితిలేష్, హరీష్ రాఘవేంద్రన్, తమిళనాడుకు చెందిన బుద్విన్ సోల్‌బర్గ్, సందీప్ కుమార్, రాజస్థాన్‌కు చెందిన జగజ్జీత్ సింగ్, అర్వన్ శర్మ మెయిన్ డ్రా మ్యాచ్‌ల్లో మూడో రౌండ్‌కు అర్హత పొందారు.
- అండర్–17 బాలికల డబుల్స్ విభాగంలో మహారాష్ట్రకు చెందిన సౌర్య మాధవి, ద్రాక్షాయణి పాటిల్, తెలంగాణకు చెందిన కీర్తి, పి.వర్ష, ఢిల్లీకి చెందిన ఆయాన్ బిషిత్, ఇషితా, కర్ణాటకకు చెందిన జాడి అనిల్, దివ్య మెయిన్ డ్రా మ్యాచ్ రెండో రౌండ్‌లో ప్రతిభ చూపి మూడో రౌండ్‌కు అర్హత పొందారు.

బాణసంచా విక్రయాలపై సమీక్ష



బాణసంచా విక్రయ ప్రదేశాలను తనిఖీ చేసి సూచనలిస్తున్న డీసీపీ విశాల్‌గున్ని, సబ్ కలెక్టర్ అదితి సింగ్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దీపావళి పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యలపై డీసీపీ విశాల్‌గున్ని, సబ్ కలెక్టర్ అదితి సింగ్ ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రెవెన్యూ, ఫైర్, విద్యుత్, మున్సిపల్, ఆరోగ్య శాఖల అధికారులతో బాణసంచా విక్రయ ప్రదేశాలలో తీసుకోవాల్సిన ముందస్తు భద్రత చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాణసంచా విక్రయదారుల లైసెన్స్‌ల కోసం ఆయా ప్రదేశాలలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని డిపార్టుమెంట్ల సమన్వయంతో ఒక సింగిల్ విండో కౌంటర్ ఏర్పాటు గురించి ఆయా శాఖల అధికారులతో తనిఖీ బృందాలను ఏర్పాటు చేయటం, బాణసంచా విక్రయ ప్రదేశాలలో దుకాణానికి, దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం, ఇసుక బకెట్ల ఏర్పాటు, స్మోక్ డిటెక్టివ్ పరికరాల ఏర్పాటు, ఫైర్ ఇంజన్లు, వాటర్ ట్యాంక్‌లు, ఆయా ప్రదేశాలలో ప్రజలు ఇబ్బంది లేకుండా లోనికి, బయటకు వచ్చేందుకు విశాలమైన మార్గాలపై చర్చించి పలు మార్గదర్శకాలను సూచించారు. ఇటువంటి సింగిల్ విండో విధానాన్ని సద్వినియోగం చేసుకుని విక్రయదారులందరూ సక్రమమైన తాత్కాలిక అనుమతులు పొంది వారి వ్యాపారాలు చేసుకోవల్సిందిగా డీసీపీ విశాల్‌గున్ని సూచించారు. బాణసంచా విక్రయదారులు ఈ నెల 9 వరకు ఆయా ప్రాంతాలలోని తహసీల్దార్ కార్యాలయ సింగిల్ విండో కౌంటర్‌లో అర్జీ పెట్టుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం డీసీపీ విశాల్‌గున్ని, సబ్ కలెక్టర్ అదితి సింగ్, ఇతర శాఖల అధికారులతో కలసి బాణసంచా విక్రయ ప్రదేశాలు వజ్రా గ్రౌండ్స్, సితార సెంటర్ సమీపంలోని విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్స్‌లను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏసీపీలు డాక్టర్ కె.హనుమంతరావు, భాస్కరరావు, సీహెచ్ రవికాంత్, సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా ఫైర్ అధికారి శంకరరావు, విద్యుత్ శాఖ ఎస్‌ఈ పి.శ్రీధర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన సాహిత్య, సాంస్కృతిక పోటీలు



ఓవరాల్ చాంపియన్ అందుకున్న నాగపూర్ విద్యార్థులు

గన్నవరం: స్థానిక వీఎస్ సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న అంతర్ రాష్ట్రాల సాహిత్య, సాంస్కృతిక పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. సాహిత్య, సాంస్కృతిక విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన మౌంట్‌ఫోర్ట్(నాగపూర్) స్కూల్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథి హైదరాబాద్ ప్రావిన్షియల్ సుపీరియర్ బ్రదర్ షైన్ అలెక్స్ మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల నుంచి 27 పాఠశాలలకు చెందిన విద్యార్థులు స్వేచ్ఛా వాతావరణంలో స్నేహపూర్వకంగా ఈ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. విభిన్న ప్రాంతాలు, మతాలు, భాషల వారు ఒకే వేదికపై చేరి భారతీయ సాహిత్య, సంస్కృతులను చాటి చెప్పడం గొప్ప విషయమన్నారు. ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు శ్రీధర్, డాక్టర్ టీఎస్‌వీ సత్యనారాయణ, పూణే ప్రావిన్షియల్ సుపీరియర్ బ్రదర్ జయకో గర్వాసిస్, హైదరాబాద్ లిటిల్‌ఫ్లవర్ ప్రిన్సిపాల్ బ్రదర్ షాజన్ ఆంటోని, సీనియర్ బ్రదర్ జిమ్మీ కురియోకోస్, బ్రదర్ భల్లా జోసఫ్, బ్రదర్ జయబాలన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేకంగా జవాన్ సినిమా ప్రదర్శన



పీవీపీ మాల్‌లో మీడియాతో మాట్లాడుతున్న మురళీకృష్ణ, ఇతర ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సినీపోలీస్, రౌండ్ టేబుల్ ఇండియా విజయవాడ శాఖ, లేడీస్ సర్కిల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 200 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పీవీపీ మాల్‌లోని సినీ పోలీస్ థియేటర్లో సోమవారం జవాన్ సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సినీ పోలీసు సంస్థ సెంటర్ హెడ్ మురళీ కృష్ణ మాట్లాడుతూ భావిభారత పౌరుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు దేశంలోని 38 పట్టణాలలో 10 వేల మందికి పైగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జవాన్ సినిమాను చూపించినట్లు తెలిపారు. రౌండ్ టేబుల్ ఇండియా, విజయవాడ చైర్మన్ ధీరజ్ సింగ్ మాట్లాడుతూ అమ్మ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 3వేల పాఠశాలల తరగతి గదులను నిర్మించామన్నారు. బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సినీ పోలీసు సంస్థ కార్యదర్శి శ్రీకర్, కౌషిక్, సభ్యులు వినీల, ఐశ్వర్య, ప్రతిభా ఆఫ్ సెట్ ప్రింటర్స్ చైర్మన్ కాట్రగడ్డ మోహన్ పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువతి ఫొటోలు వాట్సాప్, ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్టు చేసి తాము ప్రేమించుకుంటున్నామని ప్రచారం చేస్తున్న యువకుడిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గొల్లపూడి ఎల్‌ఐసీ కాలనీకి చెందిన ఎం.సరస్వతి వన్‌టౌన్‌లోని కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. మూడేళ్ల కిందట హలో యాప్‌లో కర్నూలుకు చెందిన విజయ్ పరిచయమయ్యాడు. ఫోన్ నంబర్లు పరస్పరం ఇచ్చి పుచ్చుకున్నారు. అప్పుడప్పుడు విజయవాడకు వచ్చి సరస్వతితో కలిసి పీవీపీ మాల్, రైల్వే స్టేషన్ ఇలా పలు చోట్లకు తిరిగారు. ఇద్దరూ కలిసి ఫొటోలు దిగారు. కొంత కాలంగా యువతి ఫోన్ వాడడం మానేసింది. నెల క్రితం తిరిగి ఫోన్ వాడడంతో విజయ్ తన వద్ద ఉన్న ఫొటోలు ఆమె తండ్రి వాట్సాప్, స్నేహితుల ఇన్‌స్టాకు పంపి తాము ప్రేమించుకున్నామని, పెళ్లిచేసుకోబోతున్నామని చెప్పసాగాడు. దీంతో ఆమె విజయ్‌తో మాట్లాడడం మానేసింది. మళ్లీ అదేపనిగా యువతి తండ్రికి, స్నేహితులకు ఫొటోలు పంపుతుండడంతో విసిగిపోయిన ఆమె భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మల్లేశ్వరస్వామి ఆలయాభివృద్ధి పనులు త్వరలో పూర్తి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయాభివృద్ధి పనులు త్వరలో పూర్తి కానున్నాయని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులను సోమవారం ఆయన దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్పతో కలిసి పరిశీలించారు. ఆలయ శిఖరం పనులతో పాటు ఆలయం చుట్టూ నిర్మిస్తున్న రాతి మండపం, ఆలయం లోపల జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద్‌శర్మ, పాలక మండలి సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ, ఇతర దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

కాలువలోకి స్కూల్ బస్సు పల్టీ

- స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో అదుపు తప్పిన బస్సు
- కాలువలో నీరు లేకపోవడంతో తప్పిన పెనుప్రమాదం
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రమేష్‌బాబు, పోలీసు అధికారులు



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రమేష్, ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్

కోడూరు: విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్సు అదుపు తప్పి కాలువలోకి పల్టీ కొట్టిన ఘటన కోడూరు మండలంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ... అవనిగడ్డలోని ఓ ప్రయివేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు రోజూ మాదిరిగానే సోమవారం ఉదయం పిట్టల్లంకలో విద్యార్థులను ఎక్కించుకుని అవనిగడ్డకు బయలుదేరింది. అయితే వి.కొత్తపాలెం– విశ్వనాథపల్లి గ్రామాల మధ్యకు రాగానే స్కూల్ బస్సు స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో డ్రైవర్ బస్సును అదుపు చేయలేకపోయాడు. దీంతో బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న పంట కాలువలోకి పల్టీ కొట్టింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 16 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, వాహనచోదకులు, సమీప పొలాల్లోని రైతులు వెంటనే స్పందించి బస్సు కిటికీల్లో నుంచి విద్యార్థులను బయటకు తీశారు. వంతులవారీ విధానం కారణంగా కాలువలో సాగునీరు లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. విద్యార్థులంతా సురక్షితంగా ఉన్నారని, ఏవిధమైన గాయాలు కాలేదని ఎస్‌ఐ తెలిపారు. బస్సు ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. అవనిగడ్డ సీఐ ఎల్.రమేష్ ఘటనాస్థలాన్ని పరిశీలించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రమాదంలో విద్యార్థులంతా సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వరి పంటకు ఊపిరి పోసిన వర్షం

సంతోషం వ్యక్తం చేస్తున్న దివిసీమ రైతాంగం



అవనిగడ్డ: దివిసీమలోని పలు ప్రాంతాల్లో సోమవారం కురిసిన వర్షం వరి పంటకు ఊపిరి పోసింది. సోమవారం తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకూ కోడూరు మండలం పిట్టల్లంక, నారేపాలెం, సాలెంపాలెం, విశ్వనాథపల్లి, మోపిదేవి మండలం కోసూరువారిపాలెం, నాగాయతిప్ప, పెదకళ్ళేపల్లిలో కుండపోత వర్షం కురిసింది. నాగాయలంక, అవనిగడ్డ మండలాల్లో వర్షం బాగా పడింది. చల్లపల్లి, ఘంటసాల మండలాల్లో తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి నాలుగు గంటల పాటు వర్షం కురిసింది. గత 20 రోజుల నుంచి సరైన వర్షాలు లేక, వంతుల వారీ విధానం వల్ల సరిగా సాగునీరందక దిగువ ప్రాంతాల్లో వరిపొలాలు నెర్రెలిచ్చి బీటలు వారాయి. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో 52,460 ఎకరాల్లో వరి సాగు చేయగా ప్రస్తుతం ఈనె, పాలు పోసుకునే దశ, పొట్ట దశలో పంట పొలాలు ఉన్నాయి. ఈ దశల్లో వరిపంటకు నీరు ఎంతో అవసరం. గత కొద్దిరోజులుగా సరైన వర్షాలు లేకపోవడంతో ఆయిల్ ఇంజన్లతో సాగునీరు పెట్టుకున్నా రెండు, మూడు రోజులకే ఇంకిపోయి ఎండిపోయేవి. దీనివల్ల తీవ్ర ఆందోళనలో ఉన్న దివిసీమ రైతులకు ఈ వర్షం ఎంతో ఊరటనిచ్చింది. సరైన వర్షాలు లేకపోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో వరి దుబ్బులకు పిలకలు తక్కువగా వచ్చాయని, పొలాల్లో నీళ్లు లేకపోవడం వల్ల ఎరువులు కూడా వేయలేకపోయినట్టు కొంతమంది రైతులు చెప్పారు. ఈ వర్షంతో రైతులు పిండి చల్లుకునే పనుల్లో బిజీగా ఉన్నారు. చాలా కాలం తరువాత దివిసీమలో కురిసిన వర్షం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో మైలవరం విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

మైలవరం: ఉమ్మడి కృష్ణా అండ్ ఎన్టీఆర్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఏడు బంగారు పతకాలు, మూడు రజత, ఒక కాంస్య పతకాలను సాధించి విజయకేతనం ఎగురవేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. మైలవరంలోని కళాశాల ప్రాంగణంలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ పోటీలు ఉమ్మడి కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోరంకి ఉషోదయ పబ్లిక్ స్కూల్‌లో జరిగాయన్నారు. ఈ పోటీలలో ఎస్.ప్రియాంక 56 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్, కె.పల్లవి 48 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్, ఎ.తేజస్విని 82 కిలోల కేటగిరిలో గోల్డ్ మెడల్, డి.జాహ్నవి 79 కిలోల కేటగిరీలో గోల్డ్ మెడల్, వై.రిషితశ్రీ 85కిలోల కేటగిరిలో గోల్డ్ మెడల్, ఎ.అంజనాశ్రీ 56కిలోల కేటగిరిలో సిల్వర్ మెడల్, ఎస్ నాగసాయిశ్రీ 50కిలోల కేటగిరిలో సిల్వర్ మెడల్, కె.నవచైతన్య 66కిలోల కేటగిరిలో కాంస్య పతకం, సీనియర్స్ విభాగంలో ఎ.తేజస్విని 82 కిలోల కేటగిరిలో గోల్డ్ మెడల్, డి.జాహ్నవి 79కిలోల కేటగిరిలో గోల్డ్ మెడల్, వై.రిషితశ్రీ 85కిలోల కేటగిరిలో సిల్వర్ మెడల్ సాధించారని పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన అసిస్టెంట్ పీడీ ఎం.బేబీరాణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కుమార్, ఎస్.దుర్గారెడ్డిని ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు అభినందించారు.

అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర జట్టుకు కృష్ణా విద్యార్థులు

ఒంగోలు: అండర్–17 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ అంతర్ జిల్లాల పోటీల పరిశీలకుడు జగదీశ్వరరెడ్డి ప్రకటించారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. పరిశీలకులు జగదీశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు సీహెచ్ సత్యన్నారాయణ (విజయనగరం), కె.గోపాల్‌రెడ్డి (అనంతపురం), కృష్ణకుమార్(కృష్ణాజిల్లా) ఈ రాష్ట్ర జట్లను ఎంపిక చేశారు. బాలుర రాష్ట్ర జట్టుకు ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన కె.హేమంత్ కుమార్ (కృష్ణా), బాలికల జట్టుకు కె.రిషిత ఎంపికయ్యారు. ఎంపిక చేసిన జట్లు త్వరలో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తాయి.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- ఆగి ఉన్న ద్విచక్ర వాహనాలపై దూసుకొచ్చిన లారీ
- మోపిదేవి మండలం పెదప్రోలు వద్ద ఘటన



పెదప్రోలులో ప్రమాదానికి కారణమైన లారీ

పెదప్రోలు(మోపిదేవి): 216వ నంబరు జాతీయ రహదారిపై పెనుప్రమాదం తప్పింది. గుంటూరు జిల్లా రేపల్లె నుంచి మచిలీపట్నం వెళుతున్న లారీ సోమవారం పెదప్రోలు వద్ద ఆగి ఉన్న ద్విచక్ర వాహనాలపైకి దూసుకు వచ్చింది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన సమాచారం మేరకు ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. 8 ద్విచక్రవాహనాలు మాత్రం తీవ్రంగా దెబ్బతిన్నాయి. వర్షం వస్తుందని ద్విచక్ర వాహనదారులు రోడ్డు పక్కన వాహనాలను ఆపి దగ్గరలోనే ఉన్న ఓ హోటల్ పక్కకు చేరారు. ఆ సమయంలో నిలిపిఉన్న వాహనాలపై లారీ దూసుకుపోవడంతో రెండు వాహనాలు పూర్తిగా ధ్వంసం కాగా, మరో ఆరు వాహనాలు దెబ్బతిన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన

ఎస్పీ జాషువా



స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ జాషువా

కోనేరుసెంటర్(మచిలీపట్నం): ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలనే దృక్పథంతోనే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ పి.జాషువా అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 40 అర్జీలు స్వీకరించారు. అనంతరం పోలీసు శాఖలో సిబ్బంది నుంచి కూడా అర్జీలు స్వీకరించి, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ప్రధానమైన అర్జీలు ఇవే...

- కంకిపాడుకు చెందిన వృద్ధ దంపతులు తమకు నలుగురు ఆడపిల్లలని, అందరికీ వివాహం చేశామని, అయితే నాల్గవ కుమార్తె భర్త నుంచి వేరుపడి తమ వద్ద ఉంటూ, తాము ఉంటున్న ఇంటిని, ఆస్తిని తన పేరున రాయాలని వేధిస్తోందని వాపోయారు.
- తనకు ఐదేళ్ల క్రితం వివాహం జరిగిందని, అప్పటి నుంచి అత్తింటి వారు, ఆడపడుచు, భర్త అధిక కట్నం కోసం తీవ్ర వేధింపులకు గురిచేయడమే కాకుండా, తనపై హత్యాయత్నం చేశారని, వారి నుంచి రక్షణ కల్పించాలని మచిలీపట్నంకు చెందిన వివాహిత ఫిర్యాదు చేశారు.
- పామర్రుకు చెందిన ఓ వివాహిత మూడేళ్ల క్రితం తనకు వివాహం జరిగిందని, ఏడాది కాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని అడిగిన కట్నం తీసుకురాకుంటే తన భర్తకు మరో వివాహం చేయాలని చూస్తున్నారని ఫిర్యాదు చేశారు.
- మచిలీపట్నం గిలకలదిండికి చెందిన ఓ వివాహిత తన భర్త కుటుంబ అవసరాల నిమిత్తం తెలిసిన వ్యక్తి వద్ద అప్పుగా తీసుకుని సగం చెల్లించారని, మిగతా సగం కోసం సమయం అడగ్గా, అప్పు ఇచ్చిన వ్యక్తి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వాస్పత్రిలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకారం

మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆస్పత్రి, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలల్లో పలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో అభ్యర్థులు దరఖాస్తులు అందించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద సిబ్బంది దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆదివారం నుంచి దరఖాస్తుల స్వీకారం ప్రారంభించగా తొలి రోజు 20 మంది దరఖాస్తులు అందజేశారు. సోమవారం 200 మంది వివిధ పోస్టులకు దరఖాస్తులు అందజేశారు.